# లంకలో సీత

ఎప్పుడూ శ్రీరామా అంటూ లంకలో సీత—

మసిపాత కట్టిన మాణిక్యంలా,

నివురుగప్పిన నిప్పులా,

కనుగందిన కుసుమంలా,

శీతాకాలంనాటి ఉదకంలా,

మేఘాలలోని సూర్యునిలా,

మెరుగుచెడిన అద్దంలా.

పాడ్యమినాడు చదివిన పేతంలా.

రాహుగ్రస్తమయిన చంద్రమండలంలా చింతచేత కళలు తగ్గి వుంటుందిట। ఆవిడ సీలంపు కురులు విరబోసుకున్నా. జడలు ఎవరో వేసినట్లుందట. దేవి- తలంటు ఆడకే ఆడినట్లుండు. పచ్చిపసుపు రాసుకోకపోయినా ఒక చాయ బంగారు అలదినట్లుంపట. పెట్టక కాటుక పెట్టినటులుండు. దిద్దినతిలకము దిద్దినటులుండు. సింగారించు కున్నట్లే వుంటుందట —

రాముడ్ని వదలి వున్న సీత సింగారించుకోదు. సింగారించుకోకపోయినా ఆమె వన్నెవాసి తరగదు ఈసంగతి వినుమా హనుమా అని హనుమంతుడికి నొక్కి చెబుతున్నాడు జానకీరమణుడు. ఇంకా అలదక పరిమళములలదినటులుండు వేయక తాంబూలము వేసినటులుండు. కాంతతొడుగులు తొడగకే తొడగి నట్లుండును — ఇన్నిచెప్పి- సీత "తొలకరి మెరుపువలె తావెల్గుచుండు అని వర్ణన పూర్తిచేశాడు శ్రీరామచంద్రమూర్తి.

(ఈ ఉంగరం పట్టికెళ్ళి మరొరాక్షసి ముండ కెవర్తికేనా యివ్వకుండా లంకలో వున్న సీతను పోల్చుకోవటానికి ఏడెనిమిది కాలాలకు ఓపేజీకి సరిపడే మేటరు హనుమంతుడికి యిస్తాడు శ్రీరామచంద్రమూర్తి)

దుఃఖంలో వున్నభర్త-ఒక ఘోటక బ్రహ్మచారి ఎదుట నిజభార్య సుగుణాలను. అందచందాలను. ఆమెతోడి జ్ఞాపకాలను మనసువిప్పి అడగంటే తెలియదని గోలపెడుతున్న వారిదగ్గర తన ప్రయివేటు సంగతులు సైతం ఏకరువుపెట్టాల్సివచ్చింది.

సుదతులు రూపమ్ము చూచి నే నెరుగ
శ్రీకాంత రూపమ్ము మాకు ఎరిగించి
అతివ మెచ్చేటట్లు ఆనవాలిమ్ము అని

సీతమ్మవారి ఐండిటిఫికేషన్ మార్క్సు అడిగాడు ఆంజనేయులు. ఈ రోజుల్లో అయితే కనపడుటలేదు. అని పేపర్లో వేస్తే పోలీసు రిపోర్టిస్తే సవాలక్షమంది ఆంజనేయుళ్లు వెతుక్కొని ఎంతమందినో సీతల్ని లాక్కొచ్చి రాముని కాళ్ళముందు కట్టి పడేసేవాడు. ఒక్క ఫొటో యిచ్చి కేరాఫ్ రావణాసురుడు లంక అని ఫోను నంబరిచ్చేస్తే సీతమ్మ చహరా బైటపడ్తుంది.

సీతాదేవిది లోకాతీతమైనటువంటి సౌందర్యం. అటువంటిసౌందర్యాన్ని వూహించుకుంటూ తనకు తెలిసిన సీతాదేవిడిటైల్సు ముందుచెప్పి లంకలో దురవస్థలో నున్న సీత ఎలావుంటుందో చెప్పాడు సీతారామచంద్రమూర్తి

సీతారాములంటే నాకు చాలా ఇష్టం! దుఃఖాలోకల్లా గొప్ప దుఃఖం భార్యా వియోగం.

మగవాడన్నవాడికి పెళ్ళాన్ని పరాయివాడు వచ్చి ఎత్తుకుపోతే. శోకలో వియోగాన్ని మించిన దుఃఖం మరిలేదు.

అటువంటి దుఃఖాన్ని అనుభవిస్తూ "హా సీతా" అంటూ సామాన్యునివలె ఎలుగెత్తిపోయాడు. శ్రీ జానకీరమణుడు. రామాయణంలోవి విషాదమంతా సీతారాముల ఆకల్పాంత వియోగ దుఃఖమేకదా! పెళ్ళాం కోసం మనిషిలా గుండెలు అవిసేలా ఏడ్చినవాడు కనుక శ్రీరాముడంటే

నాకు అపరిమితమైన గౌరవం. అభిమానం. ప్రేమా మరేదో — యింకేదో ....లంకలో సీత రాక్షస మాయనుకుని కోతిముండా కొడుకు యాక్షన్న" నమ్మకపోవచ్చు.

"ఈపయ్యముద్రికా యింతి చేతికిని" అనికొన్ని సెన్సారు కాబడ దిగిన రీల్సుకి పనికివచ్చే ఆనవాళ్ళు చెబుతాను దశరథరాముడు — సీతా రామాంజనేయులికి మచ్చుకి —

ఉంగరం ఒక ఆనవాలు

రైటో — రెండు.

కళ్యాణ మంటపంలో సీత వామనగుంట లాడుతూండగా చూడాలనే తలంపువచ్చి శ్రీరాముడు బయలుదేరి వచ్చాడట. రాముడ్నిచూసి తల్లి భూదేవిదగ్గరకు పారిపోయి సిగ్గుచే తలవంచుకొని నిలబడిందట:

అది ఒక ఆనవాలు.

మూడు

మిధిలా నగరంలో విల్లు విరిచి సీతను పెండ్లాడిన తరువాత చిల కల మేడలో బంగారు తరిగోళ్ళ పట్టెమంచంమీద మొదటి రాత్రి - రెండు వైపులా తలగడలు వేసి పట్టు పచ్చడం పరచి దానిమీద విరజా జులు. బొడ్డుమల్లెలు. నీలాంబరాలు. తొడిమలు తీసిన పారిజాతాలు. చల్లారట. పదివేల భమిడి గవాక్షాల నడుమ ముత్యాల వీణలు మీటుతుం డగా కోమలాంగులు తమ సన్నని నడుములు అసియాడగా అప్సరాస్త్రీలు ఆడగా, ఇది మహాప్రై భోగ మెంత సౌధ్యమ్ము అంటూ పారిజాత పానుపు మీద పవ్వళించాట్ట రఘురాముడు. అప్పుడు సీతను తీసికొచ్చి వజ్రపు గడ పల నడుమ నిలిపి బంగారు తలుపులకు తాళములువేసి కిలకిలా నవ్వుతూ వెళ్ళిపోయారట పడతులు.

అప్పుడు సిగ్గుపడుతూ నుంచున్న సీతాదేవిని చేరదీసుకోవడం కోసం వేలిఉంగరం తీసి ఆడుతూ ఎగరేసి తెమ్మన్నాడట. అప్పుడు సీతమ్మ కొంచెం ఒంగిందట. ముద్దుకుచముల నడుమ ముత్యాలహారాలు. అలివేణివీపునాకొప్పుజారగను. పొలత పాపిట జారబొట్టు తూలంగా, గాజులు భిన్నస్వనములు చేయగా, వంగి వుంగరం తీసుకుని పద్మనాభుల పాన్పు దగ్గరికిచేరి- ఇంకే ముంది? సారు ముఖం చేసుకుని చేయి జాపీ యివ్వగా చేయి పట్టుకుని శ్రీదేవి నెత్తియో తొడలపై నుంచి మహా సుఖంబున నిద్రిస్తిమయ్యా! అని ఒక ఆనవాలు హనుమంతుడికి చెప్పాడు.

(ఆరువాత జనమంతా ఈ స్టైయిల్ కాపీ కొట్టారనుకోండి రామ రాజ్యంలో)

మరో రోజు ముచ్చట- పరమ సీక్రెటు- నంబరు నాలుగు.

ఏడు నిలువుల కనకపు మేడలోపల ఎవ్వరూ యెరుగని ఏకాంతమందు శ్రీ దేవినెత్తి యా తొడలపైనుంచి- కురులువిప్పి జవ్వాది, కస్తూరి అలది జడలువేసి బొట్టుపెట్టి- ఆవిడను శృంగార భక్తురాలిగాచేసి- వేడికాగుల వేన్నీళ్ళ తోడి- భమిడికాగుల చన్నీళ్ళ తోడి- తొరిపి- ముత్యాలపీట వేసుకుని సీతారాములు మజ్జన మాడిరట- అలా జలకాలాడిన పిదప సకలాభరణ భూషితురాలయి శృంగారములు వొలికిస్తూ వయ్యారి నడకలా పైట జారగను వారచూపులు చూస్తూ వచ్చిందట. సీత ఆవిడను అల్లంత దూరన్నుంచేచూసి తలుపుగడియ వేసుకున్నాడట.

శ్రీరామచంద్రుడా తీవయ్య గడియా— అంటూ ధవళాయతాక్షి ముద్దుమాటలు విని మురవైరి రాముడు ముత్యాల గడియనెత్తి ముదితకు

తీసెను తలుపు. మళ్ళీ శ్రీదేవిని ఎత్తి వొళ్ళోకి తీసుకుని మహా సుఖమున నిద్రిస్తిమయ్యా అని యిది ఒక అనవాలని చెప్పు హనుమా అంటాడు సీతాపతి.

హనుమంతుడ్ని అల్లరిలో పడెయ్యటం కాకపోతే యిటువంటి పరమ ఇంపార్టెంటు ప్రయివేటు సంగతులు- సీక్రెట్లు- హనుమంతుడు సీతమ్మతల్లి ఎదుట చెప్పగలడా- చెప్పి వుండడు. రామదాసుఅంటూ వుండడం విని తనుకూడా భక్త్యావేశంలో చెట్టుమీద భజనచేస్తూ కూర్చుని వుంటాడు.

సీతారాములవంటి వియోగ దంపతుల మధ్య ఒక బ్రహ్మచారికి అందులో వానర శ్రేష్ఠుడికి రాయబారం జరపడం చాలా రిస్కీ జాబ్.

ఇలా అనవాళ్ళు సరసశృంగార వేద్యంగా చెప్పుకు పోయారు.

అన్నీ యిక్కడ చెప్పలేను. అవి ఎంత బావుంటాయో మచ్చుకి చెప్పేను. అంతే-

మీకు రాముడంటే ఇష్టమా కృష్ణుడంటే యిష్టమా అంటే నా ఓటు రాముడికే వేస్తాను.

శ్రీకృష్ణుని పెళ్ళాల్ని అతను బ్రతికుండగా ఎత్తుకుపోలేరు. ఆ వియోగదుఃఖం అతన్ని ప్రేమించినవాళ్ళు వలచి వచ్చినవాళ్ళు అనుభవించారేమో. కాని అతడు పైల్లా పచ్చీసుగా బతికా డంటాన్నేను

నాకు తెలీక- శ్రీకృష్ణుడంటె రవుడీ టక్కరి. ముండలముఠాకోరు. పొలిటీషయన్ అనుకునే దాన్ని.

ఆడపిల్లలకి మెజారిటీకి కృష్ణుడంటేనే యిష్టం

నాకు తెలుగువారి ఇలవేల్పు- శ్రీరాముడంటే వున్న గౌరవం ఏకొండమీది వాడన్నాలేదు

బిజినెస్‌మన్నీ. శిశుహంతకుల్నీ నరహంతకుల్నీ ఎలానైతే ప్రేమించలేమో-కొందరు దేవుళ్ళనుకూడా వాళ్ళెంత కొండమీది వాళ్ళైనప్పటికీ ఎన్ని విగ్గుల ప్యాక్టరీలున్నప్పటికీ- ఎంతమంది మినిష్టర్లు జై కొట్టినప్పటికీ చుట్టూ ఎంత అవినీతి పేరుకొన్నప్పటికీ లెక్కచెయ్యని వాళ్ళని భక్తితో గౌ:రవించలేం।

మనుష్యులంటే డబ్బులాక్కుని పరమ నీచంగాచూసి కాలితో తన్ని మెడపట్టుకుత్రోసి క్యూలో చంపే దేవుళ్ళంటే నాకు పరమ ద్వేషం।

అయితే మీకు త్యాగరాజ కీర్తనలు యిష్టవా? రామదాసు కీర్తనలు-యిష్టవా? భక్తరంజని వింటారా? వివిధ భారతి వింటారా?

ఇంతకీ మీఓటు రాముడికా - కృష్ణుడికా-